క్లుప్తంగా

నర్సరీల పరిశీలన



పెంట్లవెల్లి: మండలంలోని గోప్లాపూర్, జట ప్రోలు గ్రామాల్లో గురువారం తహసీల్దార్ హిమబిందు నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. హరిత హారంలో భాగంగా నాటిన మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం



వెల్దండ: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మరో రెండు గ్యారంటీ పథకాలను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఆరు గ్యారంటీలను విడతల వారీగా ప్రభుత్వం అమలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శేఖర్, పుల్లయ్య, ఎర్రశ్రీనుముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, రమేష్, కృష్ణముదిరాజ్, గోపాల్ తదితరులు ఉన్నారు.

నేడు మాక్ పోలింగ్

నాగర్‌కర్నూల్: విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కోసం స్వీప్‌లో భాగంగా శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల, ఉన్నత పాఠశాలల్లో మాక్ పోలింగ్ నిర్వహిస్తునట్లు డీఆర్‌డీఓ చిన్న ఓబులేసు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఎలక్ట్రానిక ఓటింగ్ యంత్రాలు, ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తుమని పేర్కొన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

ఉప్పునుంతల: మండలంలోని గ్రామాల్లో ఉన్న పశువులు, గేదెలకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మార్చి 31వరకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నామని పశువైద్యాధికారి నరేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు తాడూరులో టీకాలు వేస్తామని పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భీరయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షలు మంజూరయ్యాయి. గురువారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

బొందలపల్లిలో సంచార వైద్యసేవలు

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని బొందలపల్లిలో వృద్ధులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం సంచార వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 106 మంది వృద్ధులకు రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్‌సెక్రెటరీ రమేష్‌రెడ్డి, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ డి.కుమార్, రాజవర్ధన్‌రెడ్డి, కేశవులు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

శివమాలధారులకు అన్నదానం

కందనూలు: శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి కాలినడకన వెళ్తున్న శివమాలధారులకు గురువారం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్‌లో లలితా సహస్ర నామసేవా సమితి, కొల్లాపూర్ చౌరస్తాలోని ఆకారపు కుమారస్వామి చారిటబుల్ ట్రస్ట్, జ్ఞానేశ్వర్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం (బిక్ష), రాత్రి అల్పాహారం పంపిణీ చేశారు. శివస్వాములు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ అధ్యక్షులు ఆకారపు విశ్వనాథమ్, కొత్త రేవతి కోరారు.

ఎస్‌ఐ రమేష్‌కు సన్మానం

అమ్రాబాద్: అమ్రాబాద్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ రమేష్‌ను గురువారం ఎస్‌ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు యశ్వంత్, జగన్, ఖాజాలు పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. పూలబొకె ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



గంగాభవానీ కల్యాణ మహోత్సవం

తాడూరు: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఐతోలు మశమ్మ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలని సూచించారు. దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గ్రామ దేవతలను స్మరించుకోవడం ఉత్సవాలు నిర్వహించుకోవడం శుభపరిణామం అన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ రోహిణి, మాజీ ఉప సర్పంచ్ ఉస్సేన్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా గంగాభవానీ కల్యాణోత్సవం

కొల్లాపూర్: పట్టణంలోని గంగాభవానీ ఆలయంలో దేవతామూర్తుల కల్యాణోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం దేవతామూర్తులకు అభిషేకాలు, అర్చనలు చేశారు. పట్టువస్త్రాలతో కల్యాణమూర్తులను అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణతంతు కొనసాగింది. సాయంత్రం కల్యాణమూర్తులకు తెప్పోత్సవం నిర్వహించి, రథంపై ఊరేగించారు. ఊరేగింపులో మహిళలు కోలాట ప్రదర్శనలు చేశారు. చిన్నారులు నట్వర్ నృత్య, సంగీత కళా క్షేత్రం ఆధ్వర్యంలో చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేవతామూర్తులకు డాక్టర్ పగిడాల శ్రీనివాసరెడ్డి, జూపల్లి రామారావు, బీరం బిచ్చమ్మ, పెబ్బేటి కృష్ణయ్యతో పాటు పలువురు నాయకులు దర్శించుకున్నారు. తెలుగు, గంగపుత్ర కులస్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాలను ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు పర్యవేక్షించారు.

విద్యార్థులకు డీఈఓ అభినందన



బహుమతిని అందుకుంటున్న ఎండీ సానియా

అచ్చంపేట రూరల్: జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మ్యాథమెటిక్స్ విభాగంలో పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థిని సోనియా ఉత్తమ ప్రతిభ కనబర్చింది. జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో డీఈఓ గోవిందరాజులు విద్యార్థినిని, గైడ్ టీచర్ చందర్‌ను అభినందించి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. విద్యార్థినిని రాష్ట్ర స్థాయికి ఎంపికకావడంపై ప్రిన్సిపాల్ శేఖర్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బిజినేపల్లి : మండలంలోని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి చదవుతున్న ఎండీ. సానియా ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో మొదటి బహుమతిని డీఈవో గోవిందరాజులు చేతుల మీదుగా అందుకుంది. కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం వేంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్‌ఫేర్ పోటీల్లో కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని వలిపె గీతామృత వర్షిణి ప్రతిభ చాటింది. ఆమె కమ్యూనికేషన్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ అనే అంశాన్ని ప్రదర్శించి జిల్లా స్థాయి పోటీల్లో ఆమె ద్వితీయ బహుమతిని గెల్చుకున్నారు. జిల్లా కేంద్రంలో డీఈఓ.గోవిందరాజులు మెమెంటో అందజేశారు.

తాడూరు: జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో మండలంలోని సిర్సవాడ ఉన్నత పాఠశాలకు చెందిన అనిత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, కలెక్టర్ కార్యాలయంలో ఏఓ చంద్రశేఖర్ అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న సీఐ నాగార్జున

కల్వకుర్తి: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీఐ నాగార్జున అన్నారు. అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని కోరారు. అమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో సమకూర్చిన పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రసూనా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి చేసుకోవాలి




పర్వతాపూర్‌లో విత్తన శుద్ధి చేస్తున్న రావేప్ విద్యార్థులు

తెలకపల్లి: రైసోబియంతో విత్తన శుద్ధి చేసుకోవాలని పాలెం వ్యవసాయ కళాశాల 4వ సంవత్సరం చదువుతున్న రావేప్ విద్యార్థులు సూచించారు. గురువారం మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి, పర్వతాపూర్ గ్రామాల్లో విద్యార్థులు పంటలపై అవగాహన కల్పించారు. వివిధ పంటల్లో అధిక దిగుబడి సాధించాలంటే మేలైన నాణ్యత కలిగిన విత్తనాల ఎంపిక అవసరం అన్నారు. రైతులు అధిక దిగుబడి సాధించాలంటే విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. వివిధ పప్పు ధాన్యపు పైర్లకు వేరుశనగ, సోయాబీన్ వంటి నూనె గింజల పైర్లకు రైసోబియం ఉపయోగించుకోవచ్చని సూచించారు. వాటిని ఏవిధంగా వాడాలి, ఒక లీటర్ నీటిలో 50 గ్రాముల బెల్లం లేదా పంచదార కరిగించి 5 నిమిషాలు మరిగించి చల్లార్చి, ఈ ద్రావణానికి 200 గ్రాముల రైసోబియం కల్చర్‌ను వేసి విత్తనానికి పట్టించి విత్తనాలు విత్తుకోవాలన్నారు. ఎకరాకు 20 కిలోల పైబడి నత్రజనిని స్థిరీకరించగలవని సూచించారు. ఇలా విత్తన శుద్ధి చేసేటప్పుడు పంట దిగుబడి 25 నుంచి 30 శాతం పెరుగుతుందని తెలియజేశారు. వేరుశనగలో విత్తనాలకు విత్తనశుద్ధి చేసే పద్ధతిని ప్రదర్శించి చూపించారు. కిలో వేరుశనగ విత్తనాలకు 3 గ్రాముల మానోక్రోజెల్ కలిపి పొలంలో నేరుగా విత్తుకోవచ్చన్నారు. విత్తనశుద్ధి కోసం మాంకోజెల్ జెబ్ మరియు కార్బోడైజిం కిలో విత్తనానికి 3 గ్రాములు టేబుకోనజోల్ కిలో విత్తనానికి 1 గ్రాము రసాయనాలు వాడుకోవచ్చని సూచించారు. విత్తనశుద్ధి చేయడంతో నేల నుంచి వ్యాపించే వేరుకుల్లు తెగులు, మొదలు కుల్లు తెగుళ్లు, విత్తనాల ద్వారా ఆశించే పురుగులను నివారించుకోవచ్చన్నారు. మొలక దశలో నేలలో ఉండే కీటకాలు, శిలీంద్రాల నుంచి విత్తనాలను కాపాడుతుందని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు విశ్వతేజ, ద్వారకామయి, అనూజ, శ్వేత, ఎస్ నిఖిత, కావ్య, నవ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు సన్మానం

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇటీవల రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన శ్రీనివాస్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ జర్నలిస్టులు మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలబొకె ఇచ్చి సన్మానించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు స్థానిక జర్నలిస్టులు పేర్కొన్నారు. శ్యాం, దస్తగిరి ఉన్నారు.

ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు ఎంపిక



అక్షయ్‌కుమార్

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన దాసరి జైపాల్, మీనమ్మల రెండో కుమారుడు దాసరి అక్షయ్‌కుమార్ ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ప్రభుత్వం ప్రకటించిన గురుకులాల ప రీక్ష ఫలితాల్లో ఒకేసారి ఇంగ్రీష్ టీజీటీ, పీజీటీ, జూ నియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతూ ఎలాంటి కోచింగ్ తీసుకో కున్నా ఉద్యోగాలు సాధించిన యువకుడిని గ్రామస్తులు అభినందించారు.

పెద్దకార్పాముల వాసికి మూడు ఉద్యోగాలు



వెంకటేశ్వర్లు

పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాముల గ్రామానికి చెందిన ఇనుగంటి వెంకటేశ్వర్లు గురుకుల ఉద్యోగ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జూనియర్ లెక్చరర్, పీజీటీ, మోడల్ స్కూల్ లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. తండ్రి చంద్రమౌళీ, తల్లి అలివేలమ్మలు కూలీ పని చేస్తున్నారు. 10వ తరగతి వరకు పెద్దకార్పాముల ఉన్నత పాఠశాలలో, ఇంటర్ పద్మావతి జూనియర్ కళాశాల పెద్దకొత్తపల్లి, డిగ్రీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వనపర్తిలో, బీఎడ్, పీజీ ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్‌లో చదివాడు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాజు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌విష్ణు, బీజేపీ మండల అధ్యక్షుడు భీమేశ్వర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శేఖర్‌లు అభినందించారు.

మల్లురవికి ఎంపీ టికెట్ ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ మల్లు రవిని అధిష్టానం ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేషగౌడ్ గురువారం ఒక ప్రకటనలో కాంగ్రెస్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. బీసీలు మద్దతుగా ఉన్నారని పేర్కొన్నారు.

అచ్చంపేట రూరల్: మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవికి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ ఇవ్వాలని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, నాయకులు కృష్ణ, రాములు, శేఖర్, రాఘవ, రవి గురువారం ఒక ప్రకటనలో కోరారు.

కల్వకుర్తిరూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా మాజీ ఎంపీ మల్లురవికి అవకాశం కల్పించాలని సర్పంచ్‌ల సంఘం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల రాములు, ఎల్లికల్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, కౌన్సిలర్ రవి అధిష్టానాన్ని కోరారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపి మల్లు రవికి ఎంపీ టికెట్ వచ్చేలా చూడాలని కోరారు.

కందనూలు: నాగర్ కర్నూల్ ఎంపీ టికెట్ మల్లురవికి ఇవ్వాలని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఈ.రాములు గురువారం జిల్లా కేంద్రంలోని పీఏసీఎస్ సమావేశ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధిష్టానాన్ని కోరారు. సమావేశంలో ఏఐసీసీ నాగర్‌కర్నూల్ పార్లమెంటు కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ తైలి శ్రీనివాసులు, మహబూబ్ నగర్ జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్, మహబూబ్ నగర్ క్రిస్టియన్ నాయకుడు మిట్టు టైటస్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత : కేసు నమోదు

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం మర్రిపల్లి సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మొల్గరకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఉల్పర ఎల్లస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.

బాధితులకు ఆర్థికసాయం అందజేత



అచ్చంపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అచ్చంపేటలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విమలలు వేర్వేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం మాల ఉద్యోగుల ఐక్య వేదిక నాయకులు వారిని పరామర్శించారు. ఒక్కొక్కరికి రూ.40వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నారాయణ, ఆంజనేయులు, రవిందర్, జీవన్ కుమార్, జనార్ధన్, సైదులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శ

వంగూర్: మండలంలోని సర్వారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నర్సింహగౌడ్(42) 15 రోజుల కిందట నాగర్‌కర్నూల్ శివారులో ఈత చెట్టు మీది నుంచి కింద పడి హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. మృతుడికి భార్య శ్యామలమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాయకులు పండిత్‌రావు, పాండురంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జంగయ్య తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల పరిశీలన



కల్వకుర్తిలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ఇబ్రహీం

కల్వకుర్తి టౌన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ద్వితీయ సంవత్సరం మొదటి పరీక్షకు పట్టణంలోని 7 పరీక్షా కేంద్రాలలో కలిపి 1,259 విద్యార్థులకు గాను 1,226 విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా 33 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లుగా చీఫ్ సూపరింటెండెంట్ సురేందర్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం ఆయా పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లకు సూచించారు. పట్టణంలోని ఏడు పరీక్షా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు.

కోడేరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొత్తం 403 మంది విద్యార్థులకు గాను 362 మంది హాజరుకాగా 41 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు చీఫ్‌సూపరింటెండెంట్ బళ్ళారి శేఖర్, డిఓ అధికారి దశరథం తెలిపారు.

వెల్దండ: మండల కేంద్రంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు నుంచి ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 154మంది విద్యార్థులకు 151మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా మోడల్‌హైస్కూల్‌లో 189 మంది విద్యార్థులకుగాను 185 హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా పరీక్షల నిర్వహణ అధికారిణి సుప్రజా పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పలత, సంజీవరెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎంఫిల్ పట్టా అందుకున్న నల్లమలవాసి



పట్టా అందుకుంటున్న రాంబాబు

దోమలపెంట: అమ్రాబాద్ మండలంలోని శ్రీశైలం ఎడమగట్టు పాతాళగంగ వద్ద నివసిస్తున్న జడ్డా రాంబాబు బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి శిల్పకళా వేదిక వద్ద రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతులు మీదుగా ఎంఫిల్ పట్టా అందుకున్నట్లు గురువారం తెలిపారు. రిటైర్డ్ ప్రొఫసర్ చెన్నారెడ్డి పర్యవేక్షణలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నల్లమలలోని సలేశ్వరం జాతర విశిష్టత అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఎంఫిల్ పట్టా సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

బీజేపీ జెండా ఎగురవేస్తాం



మాట్లాడుతున్న ఎన్నం శేఖర్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్‌లో బీజేపీ జెండా ఎగురువేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఎన్నం శేఖర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిట్టింగ్ ఎంపీ పోతుగంటి రాములు, కల్వకుర్తి జెడ్పీటీసీ భరత్ ప్రసాద్‌లు పార్టీలో చేరడం ఎంతో సంతోషకరమన్నారు. ఎంపీ రాములుది దళితవర్గాల హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా ప్రజల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన పథకాలే బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గాప్రసాద్, నర్సింహా, మోహన్‌రెడ్డి, వివేకానంద, జంగయ్య యాదవ్, రామస్వామి, చందు ముదిరాజ్, పరమేష్‌గౌడ్, శ్రీకాంతాచారీ, చింటూ తదితరులు పాల్గొన్నారు.

రైతుల నిరసన



బల్మూర్ గ్రామ పంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

బల్మూర్: మండల కేంద్రం సమీపంలో నిర్మించనున్న ఉమామహేశ్వర రిజర్వాయర్‌తో గ్రామం ముంపునకు గురవుతుందని గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గ్రామస్తులు, రైతులు పంచాయయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గ్రామస్తుల తీర్మానం లేకుండానే ప్రాజెక్టును ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టును అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ప్రత్యేకాధికారి, కార్యదర్శి గ్రామస్తుల అభిప్రాయలను గ్రామసభ ద్వారా తెలుసుకొని తీర్మానించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇదే విషయాన్ని కార్యదర్శి చందర్‌ను వివరణ కోరగా ఎన్నికల కోడ్ ఉన్నందున గ్రామ సభ ఏర్పాటు చేయలేమని, కోడ్ పూర్తి అయిన తర్వాత గ్రామసభ ఏర్పాటు చేసి తీర్మానం చేస్తానని తెలిపారు.

కల్తీ కల్లు అమ్మకాలు అరికట్టాలి



మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

తాడూరు: కల్తీ కల్లు అమ్మకాలు అరికట్టాలని కేవీకే జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు అల్లాపూర్, మేడిపూర్, అంతారం తదితర గ్రామాలలో కల్తీకల్లు అమ్మకాలు పెరిగినా మామూళ్ళ మత్తులో ఎక్సైజ్ అధికారులు కూరుకుపోయారని ఆరోపించారు. సీహెచ్ తదితర మత్తు పదార్థాలు ప్రభుత్వం నిషేధించినా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. కల్లుదుకాణాలపై తనిఖీలు చేపట్టి కల్తీ కల్లు వ్యాపారాన్ని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



రాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



జంగంరెడ్డిపల్లి గిరిజనబాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో

కోడేరు: మండలంలోని రాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం గురువారం నిర్వహించారు. కలెక్టర్‌గా కృష్ణ, డిఈఓగా శ్రీహరి, ఎంఈఓగా ఉమేష్, వీరితో పాటు మరికొంత ఉపాధ్యాయులగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన వారికి పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు భాస్కర్‌శర్మ బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు ఆంజనేయులు, గట్టయ్య, మల్లికార్జున్, కోములయ్య, చిన్నవెంకట్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లి గిరిజన బాలికల ఆశ్రమబాలికల ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. హెచ్‌ఎంగా సుమిత్ర, డీటీడీఓగా సింధు, ఏటీడీఓగా అశ్విని, డిప్యూటీ డీఈఓగా అరుణలతో పాటు మరో 40 విద్యార్థినులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



తాడూరు: మండలంలోని సిర్సవాడ ఆంజనేయస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి గురువారం పూజారి జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్ రెడ్డి, ఆనంద్ ఆర్థిక సహకారంతో ప్రహరీ నిర్మిస్తునట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు.